జాతీయ స్థాయిలో

మురిసిన తమిళ సినిమా

- 'పార్కింగ్'కు అవార్డుల పంట
- ఉత్తమ సంగీత దర్శకుడిగా జీవీ ప్రకాష్
- ఉత్తమ సహాయ నటుడిగా ఎంఎస్ భాస్కర్
- బెస్ట్ స్క్రీన్‌ప్లే రైటర్‌గా రామ్‌కుమార్ బాలకృష్ణన్



'పార్కింగ్'లో ఎంఎస్ భాస్కర్



'పార్కింగ్'లో ఓ దృశ్యం



జీవీ ప్రకాష్ కుమార్

అడయార్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ అవార్డుల్లో తమిళ సినిమా మురిసింది. 2023 సంవత్సరానికిగాను 71వ జాతీయ అవార్డులను శుక్రవారం ప్రకటించింది. ఇందులో 'పార్కింగ్' చిత్రం ఏకంగా మూడు అవార్డులను సొంతం చేసుకుంది. ఉత్తమ తమిళ ప్రాంతీయ చిత్రం, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ స్క్రీన్‌ప్లే విభాగాల్లో అవార్డులను గెలుచుకుంది. అలాగే, కోలీవుడ్ ఉత్తమ సంగీత దర్శకుడిగా జీవీ ప్రకాష్ కుమార్ 'వాత్తి' చిత్రానికి జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డు కింద నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేస్తారు. ఇదిలావుంటే, మూడు జాతీయ అవార్డులను గెలుచుకున్న 'పార్కింగ్' చిత్రం రామ్‌కుమార్ బాలకృష్ణన్ దర్శకత్వంలో రూపొందింది. ఫ్యాషన్ స్టూడియోస్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రంలో యువ హీరో హరీష్ కళ్యాణ్, సీనియర్ నటుడు ఎం.ఎస్.భాస్కర్ ప్రధాన పాత్రలు పోషించారు. సామ్ సీఎస్ సంగీతం. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే వాహన పార్కింగ్ అనే కామన్ పాయింట్‌ను తీసుకుని మనుషుల్లోని అహంకారం, ఈగో, సంకుచిత బుద్ధిని వివరించారు. అలాగే, తాను దర్శకత్వం వహించిన తొలి చిత్రానికే దర్శకుడు రామ్‌కుమార్ బాలకృష్ణన్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా, ఈ మూవీలో అద్భుతమైన పాత్ర పోషించిన ఎంఎస్ భాస్కర్‌కు ఉత్తమ సహాయ నటుడిగా ఎంపికయ్యారు. అదేవిధంగా ధనుష్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన 'వాత్తి' (తెలుగులో 'సార్') చిత్రానికి సంగీతం సమకూర్చిన జీవీ ప్రకాష్ కుమార్‌కు జాతీయ అవార్డు వరించింది. ఈ సందర్భంగా జీవీ స్పందిస్తూ, 71వ జాతీయ అవార్డుకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉత్తమ సంగీత దర్శకుడిగా ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, 'పొల్లాదవన్' నుంచి 'అసురన్', 'వాత్తి', 'ఇడ్లీకడై' వరకు తనకు తనకు అవకాశం కల్పించిన ధనుష్‌కు, 'వాత్తి' నుంచి 'లక్కీభాస్కర్'కు చిత్రాలకు సంగీత దర్శకుడిగా ఎంపిక చేసిన దర్శకుడు వెంకీ అట్లూరి, 'వాత్తి' నిర్మాతలు నాగవంశీ, త్రివిక్రమ్, అలాగే, నిరంతం అండగా నిలుస్తున్న తన కుటుంబ సభ్యులు, సంగీత కళాకారులు, పాటల రచయితలు, టెక్నీషియన్లు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు జీవీ ధన్యవాదాలు తెలిపారు.

అమ్మవారి ఆలయాల్లో కోలాహలంగా

ఆడి శుక్రవారం





పాల కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్తున్న భక్తులు - నోటికి శూలాలు గుచ్చుకొని ఊరేగింపుగా ఆలయానికి వెళుతున్న భక్తుడు

ప్యారీస్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అమ్మవార్లు కొలువైన ఆలయాల్లో మూడో ఆడిశుక్రవారం వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. తిరువేర్కాడు, మాంగాడు, మైలాపూర్, చూలై, తండయార్‌పేట, ట్రిప్లికేన్ తదితర ప్రాంతాల్లో ఉన్న ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొరట్టూరు నాగవల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో, తిరువేర్కాడులోని దేవికరు మారియమ్మన్ ఆలయంలో నాగదేవతకు పూజలు నిర్వహించారు. మాంగాడులోని కామాక్షియమ్మన్ ఆలయ ప్రాంగణంలోవున్న మండపంలో ఉపవాసం చేపట్టిన భక్తులు కొత్తకుండలో పొంగించిన పొంగలి అమ్మవారికి నివేదించి పూజించారు. మైలాపూర్‌లోని ముండకన్ని అమ్మవారి ఆలయంలో అభిషేకం చేశారు. ప్యారీస్‌లోని కాళికాంబాళ్ ఆలయంలో, చూలైలోని అంకాల పరమేశ్వరి ఆలయం, షావుకారుపేటలోని నిమిషాంబిక అమ్మవారి ఆలయం, తిరువళ్లూరు సమీపంలోని పుట్లూరు అంకాల పరమేశ్వరి అమ్మన్ ఆలయం తదితర ఆలయాల్లో ఆడిశుక్రవారం వేడుకలు వైభవంగా జరిగాయి. వేకువజాము నుంచే భక్తులు వివిధ రకాల కావళ్లతోను, వంటికి, వీపుకి, నోటికి శూలాలు గుచ్చుకొని ఊరేగింపుగా ఆలయానికి వచ్చారు. వందలాది మంది మహిళలు పాల కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సంస్థలు దారిపొడవునా భక్తులకు తాగునీరు, శీతల పానీయాలు అందజేశారు. అలాగే ఎంటీసీ నగరం శివారు ప్రాంతాల నుంచి అమ్మవార్ల ఆలయాలకు ప్రత్యేక బస్సులు నడిపింది.

తిరువణ్ణామలైలో రూ.37 కోట్లతో

మినీ టైడల్ పార్క్

- శంకుస్థాపన చేసిన సీఎం స్టాలిన్
- 600మంది ఐటీ నిపుణులకు ఉపాధి





సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మినీ టైడల్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో రూ.37 కోట్లతో నెలకొల్పనున్న మినీ టైడల్ పార్క్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. సుమారు 600 మంది ఐటీ నిపుణులకు ఉపాధి కల్పించేలా ఈ టైడల్ పార్కు నిర్మించనున్నారు. సచివాలయంలో పరిశ్రమల పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖల ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్టాలిన్ ఆ టైడల్ పార్కుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఈవీ వేలు, టీఆర్బీ రాజా, ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, టిడ్కో, టైడల్ పార్క్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్‌నందూరి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ తమిళనాడు కోసం ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం

రాష్ట్ర ప్రత్యేక ప్రాజెక్టుల అమలు శాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగిన మరో కార్యక్రమంలో ఘనవ్యర్థాల నిర్వహణకు తగిన వ్యవస్థ నెలకొల్పేందుకు స్వచ్ఛ తమిళనాడు సంస్థ (క్లీన్ తమిళనాడు కంపెనీ లిమిటెడ్) ఐఐటీ మద్రాస్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి స్టాలిన్, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోడి సమక్షంలో ఒప్పంద పత్రాలపై రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దటమే కోసం ప్రభుత్వం క్లీన్ తమిళనాడు కంపెనీ ఏర్పాటు చేసిందని సీఎం స్టాలిన్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ అవగాహన ఒప్పందం ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి అనువుగా రాష్ట్రంలో ఘన వ్యర్థాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడానికి, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం తదితర పథకాలను అమలు చేయడానికి మార్గం సుగమం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక పథకాల అమలు శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌యాదవ్, స్వచ్ఛ తమిళనాడు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమా తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి చాగంటి ప్రవచనాలు



చాగంటి కోటేశ్వరరావు

ప్యారీస్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భారతీయతా వాహిని చెన్నై ఆధ్వర్యంలో ప్రవచన సార్వభౌమ చాగంటి కోటేశ్వరరావు 'భక్తి-ముక్తి'అనే అంశంపై రెండురోజుల పాటు ప్రవచించనున్నారు. చేట్‌పేట్‌లోని కుచలాంబాళ్ కల్యాణ మహల్ వేదికగా శని, ఆదివారాల్లో సాయంత్రం 6.15 గంటల నుంచి చాగంటి ప్రవచన కార్యక్రమం జరుగుతుంది. ఈ ప్రవచనాలకు అందరూ ఆహ్వానితులేనని, రెండ్రోజుల ప్రవచన కార్యక్రమంలో పాల్గొనే భక్తుందరికీ ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు భారతీయతా వాహిని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

రాహుల్, సోనియాతో సీఎల్పీనేత భేటీ

- కొత్త కార్యవర్గం ఎంపికపై చర్చ



ఢిల్లీలో రాహుల్‌గాంధీ, సోనియాగాంధీతో సీఎల్‌పీ నేత రాజేష్‌కుమార్

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్‌పీ) నాయకుడు రాజేష్‌కుమార్ ఢిల్లీలో ఆ పార్టీ అగ్రనేతలైన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. అదే సమయంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ సభ్యుల నియామకం, ప్రత్యేకించి జిల్లా కార్యదర్శులను ఇంకా నియమించకపోవడంపై రాజేష్ వివరించినట్లు తెలిసింది. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఇక ఎనిమిది నెలలే గడువుందని, టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా సెల్వపెరుంతగై బాధ్యతలు చేపట్టి నుండి ఇప్పటి వరకు కొత్త కార్యవర్గాల జాబితా విడుదల చేయకపోవడంతో పార్టీలో అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయని, వీలైనంత త్వరగా కొత్త కార్యవర్గాలను ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే విధంగా శాసనసభ ఎన్నికల్లో ఈసారి డీఎంకే కూటమి నుంచి ఎక్కువ సీట్లను పొందాలని, ఆ దిశగా రాహుల్‌గాంధీ డీఎంకే అధ్యక్షుడు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో చర్చలు జరపాలని కూడా రాజేష్ కోరారు. కాగా పార్టీ సభ్యత్వ ముమ్మర కార్యక్రమాలను నిర్వహించాలని, కేంద్రంలోని ఎన్డీయే పాలనలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రచారం జరపాలని ఈ సందర్భంగా రాహుల్, సోనియా సీఎల్పీ నేత రాజేష్‌కుమార్‌ను ఆదేశించినట్లు సమాచారం.

38 జిల్లాల్లో

'నలమ్ కాక్కుమ్ స్టాలిన్'

- ఉదయం రక్త పరీక్షలు .. సాయంత్రానికి ఫలితాలు
- నేడు ప్రారంభించనున్న సీఎం

అడయార్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 38 జిల్లాల్లో 'నలమ్ కాక్కుమ్ స్టాలిన్' పేరుతో వైద్య శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటుచేయనుంది. వీటిని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం నగరంలో ప్రారంభించనున్నారు. ఈ శిబిరాలకు ఉదయం వచ్చి పరీక్షలు చేయించుకునే వారికి సాయంత్రానికి ఫలితాలు అందజేసేలా ఏర్పాట్లుచేశారు. ఈ వైద్య శిబిరాల ఏర్పాటులో చెన్నై కార్పొరేషన్, గ్రామీణ ప్రాంతాలు, గుడిసె ప్రాంతాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మైలాపూర్, కామరాజర్ సాలైలోని సెయింట్ పీట్స్ ఆంగ్లో ఇండియన్ హైయ్యర్ సెకండరీ పాఠశాలలో ఈ వైద్య శిబిరాన్ని సీఎం స్టాలిన్ ప్రారంభిస్తారు. ఇదే విషయంపై ప్రభుత్వ మీడియా విభాగం కార్యదర్శి, తమిళనాడు విద్యుత్ బోర్డు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రాధాకృష్ణన్, వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సెందిల్ కుమార్, కార్మిక సంక్షేమ శాఖ కార్యదర్శి వీరరాఘవ రావు, ఆది ద్రావిడ సంక్షేమ శాఖ కార్యదర్శి లక్ష్మి ప్రియ శుక్రవారం ఉదయం సచివాలయంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. సీఎం స్టాలిన్ నగరంలో తొలి శిబిరాన్ని ప్రారంభిస్తారని, ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 1256 వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. వీటిలో చెన్నై కార్పొరేషన్ పరిధిలో 15, మిగిలిన కార్పొరేషన్లు ఒక్కో దానికి నాలుగు చొప్పున, 10 లక్షల జనాభాకంటే ఎక్కువ ఉండే 5 కార్పొరేషన్లలో 20 శిబిరాలు, 10 లక్షల కంటే తక్కువ జనాభా ఉండే 19 కార్పొరేషన్‌లలో 57 వైద్య శిబిరాలు, మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో కలుపుకుని మొత్తం 1256 వైద్య శిబిరాలను నిర్వహిస్తామని వారు వెల్లడించారు. ఈ శిబిరాల్లో బీపీ, బ్లడ్ కొలెస్ట్రాల్, కిడ్నీల పనితీరు, ఎక్స్‌రే, ఎకో కార్డియోగ్రామ్, అల్ట్రాసౌండ్ స్కాన్, గర్భకోశ, బ్రెస్ట్ క్యాన్సర్, ఈఎన్‌టీ, నేత్ర తదితర పరీక్షలు చేస్తారని, ఈ శిబిరాల్లో జనరల్ ఫిజీషియన్‌లతో పాటు వివిధ విభాగాల వైద్య నిపుణులుంటారని తెలిపారు. ప్రతి జిల్లాలో ప్రతి శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరాలు జరుగుతాయన్నారు.

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎన్నిక వ్యవహారం

ఈపీఎస్ పిటిషన్ తోసివేత

- సిటీ సివిల్ కోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా తనను ఎన్నుకోవడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ కొట్టివేయాలంటూ మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) చేసుకున్న వినతిని చెన్నై సిటీ సివిల్‌కోర్టు తోసిపుచ్చింది. 2022 జూలై 11న జరిగిన అన్నాడీఎంకే సర్వసభ్య కమిటీ సమావేశంలో ఎడప్పాడి పళనిస్వామిని ఆ పార్టీ కార్యదర్శిగా ప్రకటించడాన్ని వ్యతికరేకిస్తూ దిండుగల్‌కు చెందిన సూర్యమూర్తి సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ వేశారు. అందులో అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం ఆమోదించిన తీర్మానాలు పార్టీ అజెండాకు వ్యతిరేకమని, నిబంధనలను అతిక్రమించి ఈపీఎస్‌ను ఎన్నుకున్నారని పిటిషనర్ ఆరోపించారు. ఈ కేసు నాలుగో సిటీ సివిల్‌కోర్టులో విచారణలో ఉన్న నేపథ్యంలో, తనకు వ్యతిరేకంగా దాఖలు చేసిన ఆ పిటిషన్‌ను కొట్టివేయాలని ఈపీఎస్ మరో పిటిషన్ పెట్టుకున్నారు. అందులో సూర్యమూర్తి అన్నాడీఎంకే సభ్యుడు కాదని, అతడికి పార్టీ పనితీరు గురించి ప్రశ్నించే హక్కులేదని సూచించారు. శుక్రవారం ఈ కేసు న్యాయమూర్తి శివశక్తివేల్ కన్నన్ ముందుకు విచారణకు రాగా, ఇరుతరుపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. అనంతరం సూర్యమూర్తి దాఖలు చేసిన పిటిషన్ విచారణకు ఆమోదయోగ్యమని న్యాయమూర్తి శివశక్తివేల్ కన్నన్ సూచించారు. అన్నాడీఎంకే నిబంధనల ప్రకారం ఆ పార్టీ ప్రాథమిక సభ్యులు ఈపీఎస్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆధారాలు చూపించని కారణంవల్ల ఈపీఎస్ పిటిషన్‌ను తోసిపుచ్చుతున్నట్లు ఆదేశిస్తూ ఈ కేసు విచారణ కొనసాగుతుందని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

అన్నాడీఎంకే కులమతాలకు అతీతం

- ఈపీఎస్



ప్యారీస్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేకు కులమతాల పట్టింపులేదని, అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం అందించాలన్నదే తమ పార్టీ లక్ష్యమని, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' అనే నినాదంతో చేపట్టిన తన ప్రచార యాత్రలో భాగంగా ఈపీఎస్ శుక్రవారం తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా సెన్బగవళ్ళి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కోవిల్‌పట్టి ప్రాంతంలోని ఓ కల్యాణమండపంలో ఆయన క్రైస్తవ, ముస్లిం మత గురువులు, అగ్గిపెట్టె పరిశ్రమల యజమానులు, వేరుశనగ మిఠాయి ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సంఘాల తరుపున మాట్లాడిన ప్రతినిధులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. అనంతరం ఈపీఎస్ మాట్లాడుతూ, చిన్నా, మధ్య తరహా పరిశ్రమల సంఖ్య పెరిగితేనే నాణ్యమైన ఉత్పత్తితో పాటు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, ఇందుకోసం మాజీ ముఖ్యమంత్రి జయలలిత ప్రభుత్వం, తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా వ్యవహరిస్తున్న అన్నాడీఎంకే గతంలో అధికారంలో ఉన్న సమయంలో రంజాన్ మాసంలో ఇఫ్తార్ గంజికి అవసరమైన బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు, హజ్ యాత్రకు నిధులు అందజేశామని, మైనారిటీల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మొక్కజొన్న, పత్తి, అగ్గిపెట్టెలు, వేరుశనగ మిఠాయి పరిశ్రమల అభివృద్ధికి అన్నాడీఎంకే అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మాజీమంత్రులు కడంబూరు రాజు, ఉదయ్‌కుమార్, డాక్టర్ విజయ్‌భాస్కర్, దళవాయి సుందరం తదితరులు పాల్గొన్నారు.

సీఎన్‌జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు ఒప్పందం



ఒప్పంద పత్రాలతో ఇరువర్గాల ప్రతినిధులు

అడయార్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎన్‌జీ గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(మౌలిక సదుపాయాల కల్పన) ఏర్పాటు చేసేందుకు వీలుగా థింక్ గ్యాస్, ఎంటీసీ మధ్య కీలకమైన ఒప్పందం కుదిరింది. ఇందులోభాగంగా తొలి దశలో 100కు పైగా సీఎన్‌జీ సెంటర్లను నెలకొల్పుతారు. ఈ ఒప్పంద పత్రాలపై ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శి కె.ఫణీంద్ర రెడ్డి, ఎంటీసీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ టి. ప్రభుశంకర్ సమక్షంలో థింక్ గ్యాస్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్, హెడ్ వినుకుమార్ ఎస్.బాలకృష్ణన్, ఎంటీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సీకే రాఘవన్ సంతకాలు చేశారు. రాష్ట్రంల సీఎన్‌జీ మౌలిక సదుపాయాల రూపకల్పన కోసం తాము కట్టుబడివుంటామని వినుకుమార్ ఎస్.బాలకృష్ణన్ వెల్లడించారు.

సమాచార దృష్టి

ఓనం సందర్భంగా ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఓనం పండుగను పురస్కరించుకుని చెన్నై సెంట్రల్-కొల్లం మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06119 చెన్నై సెంట్రల్-కొల్లం వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 27, సెప్టెంబరు 3,10 తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి మధ్యాహ్నం 3.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.40 గంటలకు కొల్లం చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06120 కొల్లం చెన్నై సెంట్రల్ వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 28, సెప్టెంబరు 4,11 తేదీల్లో కొల్లంలో ఉదయం 10.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు వేకువజామున 3.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ఈ రైళ్లకు ముందస్తు రిజర్వేషన్ శనివారం ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలిపింది.

ఎమ్మార్టీఎస్-మెట్రో రైలు అనుసంధానానికి అనుమతి

పెరంబూర్, ఆగస్టు 1: చెన్నై బీచ్ నుంచి వేళచ్చేరి వరకు నడుపుతున్న ఎమ్మార్టీఎస్ రైళ్లలను మెట్రో రైల్‌తో అనుసంధానానికి రైల్వే బోర్డు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఈ మేరకు అనుసంధాన ఒప్పందాలపై మరో మూడు నెలల్లో సంతకాలు చేయనున్నట్లు, ఈ ఏడాది చివరి నాటికి అనుసంధానం పూర్తవుతుందని రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది.

ఈ నెలలో పాఠశాలలకు 12 రోజులు సెలవులు

పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలలు, కళాశాలలకు ఆగస్టులో 12 రోజులు సెలవు రోజులున్నాయి. 2025-26 విద్యా సంవత్సరంలో 210 రోజులు పాఠశాలల పనిదినాలుగా ప్రకటించగా, శని, ఆదివారాలు సెలవు రోజులు. ఆ ప్రకారం, ఈ నెలలో శని, ఆదివారాలు 2-3,9-10-16-17,23-24,30-31 పది రోజులు సెలవులు కాగా, 15న (శుక్రవారం) స్వాతంత్ర్య దినోత్సవం, 27న వినాయక చవితి సెలవులు మొత్తం 12 రోజులు సెలవులున్నాయి. అదే సమయంలో, 16వ తేది కృష్ణ జయంతి శనివారం సాధారణ సెలవు.

11,12తేదీల్లో కోవై, తిరుప్పూర్‌లో సీఎం పర్యటన

పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 11,12 తేదీల్లో కోయంబత్తూర్, తిరుప్పూర్ జిల్లాల్లో పర్యటించనున్నారు. నగరం నుంచి విమానంలో కోవై వెళ్లి, అక్కడి నుంచి రోడ్డు మార్గంగా తిరుప్పూర్ వెళ్లనున్న ముఖ్యమంత్రి, వేలంపాళయంలో నిర్మించిన ప్రభుత్వాసుపత్రి భవనాలు ప్రారంభించనున్నారు. అనంతరం కోవై కొత్త బస్టాండ్‌ను ప్రారంభించి, మడత్తుకుళంలో ఏర్పాటుచేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. 12న పొల్లాచ్చికి వెళ్లి కొత్తగా నిర్మించిన ఆడిటోరియం ప్రారంభించనున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా కోవై, తిరుప్పూర్‌లో సీఎం రోడ్ షో నిర్వహించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

'గవర్నర్ పురస్కారాలు' దరఖాస్తుల గడువు పొడిగింపు

పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజ్‌భవన్ ఆధ్వర్యంలో అందించే రెండు పురస్కారాలకు దరఖాస్తుల సమర్పణ గడువు పొడిగించారు. ఈ మేరకు రాజ్‌భవన్ విడుదల చేసిన ప్రకటనలో... 'సమాజ సేవ', 'పర్యావరణ పరిరక్షణ' తదితర రెండు విభాగాల్లో 'గవర్నర్ పురస్కారాలు 2025' సంవత్సరానికి దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. దరఖాస్తులను ఈ నెల 14వ తేది సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలని ప్రకటించిన నేపథ్యంలో, దరఖాస్తుల సమర్పణ ఈ నెల 20వ తేది సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు రాజ్‌భవన్ తెలియజేసింది.

11 నుంచి ఈపీఎస్ మూడో విడత ప్రచారం

పెరంబూర్,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): 'మక్కలై కాప్పోం... తమిళగత్తై మీట్పోం' నినాదంతో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ఆయన ఈ నెల 11 నుంచి మూడో విడత ప్రచారం చేపట్టనున్నారు. 11న కృష్ణగిరిలో ప్రారంభమయ్యే మూడవ విడత ప్రచారం 23న తిరుపోరూర్ నియోజకవర్గంలో ముగియనుంది. ఈ పర్యటనలో, కృష్ణగిరి, తిరుపత్తూర్, వేలూరు, రాణిపేట, తిరువణ్ణామలై, కాంచీపురం, చెంగల్పట్టు, చెన్నై జిల్లాల్లోని శాసనసభ నియోజకవర్గాల్లో ఈపీఎస్ ప్రచారం ఉంటుందని అన్నాడీఎంకే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు చెన్నై సెంట్రల్-గూడూరు మార్గంలో 17 సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షన్‌లోని గుమ్మిడిపూండి-కావరైపేట మధ్య మరమ్మతుల కారణంగా శనివారం 17 సబర్బన్ రైళ్లు రద్దు చేశారు. మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి-సూళ్లూరుపేట, చెన్నై బీచ్-గుమ్మిడిపూండి మధ్య సబర్బన్ రైళ్లు రద్దయ్యాయి. ప్రయాణికుల సౌకర్యార్థం మీంజూరు, పొన్నేరి నుంచి చెన్నై సెంట్రల్, చెన్నై బీచ్‌లకు 14 ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

రూ.34.50 తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర

పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.34.50 తగ్గింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలకు అనుగుణంగా ఆయిల్ సంస్థలు, ప్రతినెలా గ్యాస్ సిలిండర్ల ధరలు సమీక్షిస్తుంటాయి. ఆ ప్రకారం, ఆగస్టు నెలకు సంబంధించి 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.34.50 తగ్గి రూ.1,7,89కు విక్రయమవుతోంది. అదే సమయంలో, గృహ వినియోగ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పులు లేదని గ్యాస్ కంపెనీలు వెల్లడించాయి.

టైర్ల ఉత్పత్తిలో రాష్ట్రం వాటా 30 శాతం

పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది 30 లక్షలకు పైగా టైర్లు ఉత్పత్తి చేస్తుండగా, అందులో 30 శాతం శ్రీ పెరుంబుదూర్-ఒరగడం ప్రాంతంలో ఉత్పత్తి అవుతున్నాయి. శ్రీపెరుంబుదూర్-ఒరగడం ప్రాంతంలో దేశంలోని ప్రముఖ సంస్థలు అపోలో టైర్స్, సియట్ టైర్స్, జేకే టైర్స్ పలు వాహనాలకు ఉపయోగించే టైర్లు తయారుచేస్తున్నాయి. హ్యుండాయ్, రేనాల్ట్ నిసాన్, యమహా, రాయల్ ఎన్‌ఫీల్డ్ తదితర వాహనాల కర్మాగారాలు కూడా ఈ ప్రాంతంలో ఉండడంతో టైర్ల ఉత్పత్తికి ఆధారంగా మారాయి. ఈ ప్రాంతానికి సమీపంలో కాట్టుపల్లి, కామరాజర్, చెన్నై తదతర మూడు హార్బర్లు ఉండడంతో, విదేశాలకు టైర్లు ఎగుమతి చేస్తున్నట్లు టైర్ల సంస్థల ప్రతినిధులు తెలిపారు.

మోడల్ స్కూలు విద్యార్థి ఆత్మహత్య

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా తువాక్కుడిలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రాంగణంలోని హాస్టల్‌గదిలో ప్లస్-2 విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మే 8న ఈ పాఠశాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. 9 నుండి ప్లస్-2 వరకు ఉన్న రెసిడెన్షియల్ స్కూలు తరహాలో ఉన్న ఈ స్కూలు ప్రాంగణంలోనే హాస్టల్ భవనం కూడా ఉంది. ఈ నేపథ్యంలో వేలూరు జిల్లా కొడియనత్తం వసంతనగర్ ఎం.కుప్పం ప్రాంతానికి చెందిన బలరామన్ కుమారుడు యువరాజ్ (17) గురువారం సాయంత్రం హాస్టల్‌గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సమాచారం అందుకుని తువాక్కుడి పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని యువరాజ్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. తిరుచ్చి డీఎస్పీ సెల్వనాగరత్తినం ఆ పాఠశాలకు వెళ్ళి విచారణ జరిపారు. ఈ పాఠశాలలోనే జూన్ 11న ప్లస్-2 విద్యార్థిని కూడా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇలా వరుసగా ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య జరుగటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ సంఘటనకు నిరసన వ్యక్తం చేస్తూ యువరాజ్ తల్లిదండ్రులు, ఇతర కుటుంబీకులు,, స్థానికులు కలిసి గురువారం రాత్రి ఆ స్కూలును ముట్టడించేందుకు ప్రయత్నించారు. పోలీసులు జోక్యంచేసుకుని ఆందోళన జరుపుతున్నవారిని శాంతింపజేశారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో వరుసగా ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం గర్హనీయమని, పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ నియోజకవర్గం పరిధిలో ఉన్న పాఠశాలలోనే ఇలాంటి సంఘటన జరుగటం శోచనీయమని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య సంఘటనలపై సమగ్రమైన దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.



స్కూలు వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులు. ఇన్‌సెట్‌లో యువరాజ్ (ఫైల్‌ఫొటో)

వేప్పూర్ సంతలో రూ.3కోట్ల మేర మేకల విక్రయాలు

ప్యారీస్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా వేప్పూర్ సంతలో శుక్రవారం పశువుల వ్యాపారం జోరుగా సాగింది. వచ్చే ఆదివారం ఆడిపెరుక్కు సందర్భంగా నదీ పరీవాహక ప్రాంతాల్లో విశేష పూజలు, వంట వండి వడ్డించే సంప్రదాయాన్ని పాటించనున్నారు. ఈ నేపథ్యంలో, మంగళూరు, పెరియనేసలూరు, కాట్టుమలిర్, కరుదూర్ తదితర 50కు పైగా గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు సుమారు 3వేలకు పైగా మేకలను వేప్పూర్ వారసంతకు తరలించారు. సంతలో చెన్నై, తేని, నాగపట్నం, కోయంబత్తూరు, సేలం, విల్లుపురం, కళ్లకురిచ్చి, పుదుచ్చేరి, మదురై తదితర ప్రాంతాల వ్యాపారులు సుమారు రూ.3కోట్ల మేర జమునాపురి, శివపాడు, రామనాథపురం, వేల్లాడు తదితర 8జాతులకు చెందిన మేకలను కొనుగోలు చేయడంపై విక్రయదారులు హర్షం వ్యక్తం చేశారు.

అరుంధతీయ మక్కళ్ కట్చి నేతకు మంత్రుల నివాళి

వేలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అరుంధతీయ మక్కళ్ కట్చి వ్యవస్థాపకుడు, రాణిపేట జిల్లా వాలాజాపేటకు చెందిన వలసై రవిచంద్రన్ అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతిచెందారు. ఆయన మృతదేహానికి ఆదిద్రావిడ సంక్షేమ శాఖ మంత్రి మదివేందన్, చేనేత శాఖ మంత్రి గాంధీ తదితరులు నివాళులర్పించారు. మృతిచెందిన రవిచంద్రన్, లెదర్ ఇండస్ట్రీస్ కార్మికుల సంక్షేమ శాఖ అధ్యక్షుడిగా వ్యవహరించడంతో పాటు అరుంధతీయ ప్రజల కోసం నిరంతరం శ్రమించారని పలు పార్టీల నేతలు ఆయన నివాళులర్పించారు.



వలసై రవిచంద్రన్ (ఫైల్‌ఫొటో)

కరెన్సీ నోట్లతో వాంజి అమ్మవారికి అలంకరణ



వేలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సమీపం వంజూరు గ్రామంలో ఉన్న వాంజి అమ్మవారి ఆలయంలో ఆడి నెల మూడో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. రూ.15 లక్షల విలువైన రూ.10,రూ.20,రూ.50, రూ.100,రూ.200 కరెన్సీ నోట్ల అలంకరణతో ఉన్న అమ్మవారిని భక్తులు తన్మయత్వంతో దర్శించుకున్నారు.. అలాగే, కొత్త బస్టాండ్ సమీపంలోని విష్ణుదుర్గ అమ్మవారి ఆలయంలో దుర్గ అమ్మవారికి వెన్నతో అలంక రించారు. సలవన్‌పేట అనైకులత్తమ్మన్ ఆలయం, పడవేట్టమ్మన్ ఆలయంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధన చేశారు. ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్ని అమ్మవార్లను సేవించుకున్నారు.

నేడు, రేపు 'నేచురల్ బజార్'

పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కంలోని అన్నై థెరిస్సా మహిళా ప్రాంగణంలో శని, ఆదివారాల్లో 'నేచురల్ బజార్' జరుగనుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని మహిళా సంఘాలు ఉత్పత్తి చేసే సాంప్రదాయ బియ్యం, చిన్న ధాన్యాలు, చిన్న ధాన్యం, విలువ ఆధారిత ఉత్పత్తులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, తాటి ఉత్పత్తులు తదితర సహజ ఉత్పత్తులను విక్రయించనున్నారు. అలాగే, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసే ఆహార పదార్థాలు కూడా విక్రయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

1000 బస్సులు సీఎన్‌జీగా మార్పు

ప్యారీస్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రవాణా సంస్థలో ఎంపిక చేసిన వెయ్యి బస్సులను సీఎన్‌జీకి మార్పు చేయాలని రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పర్యావరణ పరిరక్షణ, డీజిల్ ఖర్చు తగ్గించాలనే ఉద్దేశంతో డీజిల్‌కు ప్రత్యమ్నాయంగా సీఎన్‌జీ ద్వారా బస్సులను నడిపేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ బృహత్తర పథకంలో తొలిదశగా గత జనవరిలో 3 బస్సులు ఎంపిక చేసి వాటిలో సీఎన్‌జీ టెక్నాలజీ పొందుపరిచి నడుపుతున్నారు. ఈ బస్సులకు ప్రయాణికుల నుంచి ఆదరణ రావడం, ఇంధన ఖర్చు ఆదా తదితర కారణాల వల్ల సీఎన్‌జీ బస్సుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వ రవాణాశాఖ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో, రవాణాశాఖ మంత్రి శివశంకర్ సీఎన్‌జీ టెక్నాలజీకి ప్రభుత్వ బస్సులను మార్పుచేయడంపై మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ రవాణా సంస్థలు నడుపుతున్న బస్సుల్లో గత నెలలో 40 బస్సులను సీఎన్‌జీ టెక్నాలజీకి మార్పు చేసినట్లు తెలిపారు. దీని కారణంగా బస్సుల్లో కిలోమీటర్‌కు రూ.3.94 ఆదా చేయవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించేలా వెయ్యి బస్సులను ఎంపిక చేసి సీఎన్‌జీకి మార్పు చేయదలిచామని, దీనికి అవసరమైన పరికరాలను కొనుగోలు చేసి పరఫరా చేయాల్సింది సంబంధిత రవాణాశాఖ అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

నాపై అవినీతి ఆరోపణలు రాజకీయ కక్ష సాధింపు

● మాజీ మంత్రి సెంథిల్ బాలాజి

పెరంబూర్,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి):నాపై మోపిన అవినీతి ఆరోపణలు రాజకీయ కక్ష సాధింపు చర్యలని మాజీ మంత్రి వి.సెంథిల్ బాలాజీ తెలిపారు. కరూర్ సమీపం పందుతకారన్‌పుదూర్‌లోని ఓ మహిళా కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సెంథిల్ బాలాజీ విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.తనపైవచ్చిన అవినీతి ఆరోపణలకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామిపై నమ్మకంలేదని 18 మంది ఎమ్మెల్యేలు గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని, ఆ తర్వాతే తనపై కేసు నమోదైందని తెలిపారు. ఉద్యోగానికి రూ.1.5 లక్షలు కోల్పోయామని చెబుతున్న వ్యక్తులు, రూ.50 లక్షలు వెచ్చించి న్యాయవాదులను నియమించుకునే శక్తి ఉంటుందా, దాని వెనుక ఎవరు ఉన్నారో స్పష్టంగా తెలుస్తుందన్నారు. రాజకీయ రంగంలో ప్రజల అండతో విజయం సాధించలేని వారు, ఎన్నికల్లో తానుండరాదన్న ఉద్దేశంతోనే ఇలాంటి కేసులు బనాయించి, తనకు శిక్ష వేసేలా ప్రయత్నించే వారికల నెరవేరదన్నారు.

భవానీవాగుకు వరద

● నీట మునిగిన అరటితోటలు

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయం సమీపం సిరుముగై వద్ద భవానీ వాగు, మాయారు వాగులో ఏర్పడిన వరదలకు అరటితోటలు నీట మునిగాయి. సిరుముగై నగరపంచాయితీ లింగాపురం, దాని పరిసర ప్రాంతాలైన కాంత వయల్, బొక్కె మేడు, పాత కూత్తాంమండి, తిమ్మరాయపాళయం ప్రాంతాల్లో రైతులు విస్తారంగా అరటితోటలు పెంచుతున్నారు. భవానీసాగర్ డ్యామ్ నుండి కూడా అదనపు జలాలు విడుదల కావటంతో లింగాపురం, కాంతవయల్ తదితర ప్రాంతాల్లో అరటి తోటలన్నీ నీటమునిగిపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటమునిగి పంటనష్టంతో బాధపడుతున్న తమకు ప్రభుత్వం తగు నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.



సిరుముగై వద్ద వరదనీటిలో మునిగిన అరటిచెట్లు

తిరుత్తణి రెండో ఘాట్‌రోడ్‌పై అధికారుల సర్వే

తిరుత్తణి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి కొండపై ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రప్రభుత్వం ఆలయానికి రెండో ఘాట్‌రోడ్ ఏర్పాటుకు స్థలసేకరణ ప్రారంభించింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.32.05 కోట్లు కేటాయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం రెవెన్యూ, జాతీయ రహదారులశాఖల అధికారులు తిరుత్తణి కొండపై భూసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా 2వ ఘాట్ రోడ్డుపనులను జాతీయ రహదారులశాఖ ఎస్‌ఈ శరవణ సెల్వం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, త్వరలో ప్రారంభం కానున్న ఈ రెండో ఘాట్‌రోడ్డు పనుల్లో భాగంగా ఆ ప్రాంతంలోవున్న ఇళ్లను కూల్చివేయాల్సివుంటుందని, ఇందులో ఎన్ని ఇళ్లు పోతాయన్నదానిపై విశ్లేషణ చేస్తున్నామని, కూల్చబోయే ఇళ్ల యజమానులకు నష్టపరిహారం చెల్లింపు, తదితర పనులన్నీ పూర్తికాగానే రెండోఘాట్ రోడ్డు పనులు ప్రారంభంకానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హైవేస్ డీఈ చిత్రారసు, ఏఈ రఘువరన్, తాహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.



తిరుత్తణి ఘాట్‌రోడ్

కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

వేలూరు, ఆగస్టు 1: డా.ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ తరఫున ఆర్కాడు బస్టాండ్‌లో శుక్రవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే, పలువురికి సంక్షేమ సహాయాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్కాడు మున్సిపాలిటీ అధ్యక్షులు దేవి, కౌన్సిలర్లు ఆనంద్, రాజశేఖర్, రాణిపేట రోటరీ సంఘం అధ్యక్షులు భరత్‌కుమార్, పారిశ్రామికవేత్త ఆకాశ్ హేమరాజ్, ట్రస్ట్ అధ్యక్షులు గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న అతిథులు, ట్రస్ట్ నిర్వాహకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఆవడి: సప్తగిరి నగర్, పాండియన్ నగర్, లక్ష్మీపురం, మారుతి అవెన్యూ, అశోక్‌నిరంజన్ నగర్, శ్రీరామ్ నగర్, మూర్తి నగర్, టీఎన్‌హెచ్‌బీ, ఆదిపరాశక్తి నగర్, ఫైర్ స్టేషన్ రోడ్డు, పరుతిపట్టు, కామరాజర్ నగర్, వసంతం నగర్, జేబీ ఎస్టేట్, జీవ నగర్, శంకర్ నగర్, గోవర్ధనగిరి, ఎన్ఎం రోడ్డు, జీవానందం నగర్, పీహెచ్ మెయిన్ రోడ్డు, పుదు నగర్, ఆనందన్ నగర్

వేళచ్చేరి: వెంకటేశ్వర నగర్, ఎంజీఆర్ నగర్, బైపాస్ రోడ్డు, దేవి కరుమారియమ్మన్ నగర్, శశి నగర్, పద్మావతి నగర్, మురుగు నగర్, విజయ నగర్, గంగై నగర్, భువనేశ్వరి నగర్, రామ నగర్, నెహ్రూ నగర్, దండీశ్వరం నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, 100 అడుగుల రోడ్డు, రాజ్యలక్ష్మి నగర్, జగన్నాదపురం, ద్రౌపతి అమ్మన్ ఆలయం, టాన్సీ నగర్, గాంధీ వీధి, వీజీపీ సెల్వ నగర్, సీతారామన్ నగర్, భువనేశ్వరి నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, తరమణి, బేబి నగర్. **కొట్టివాక్కం:** జర్నలిస్ట్ కాలనీ, లక్ష్మణ పెరుమాళ్ నగర్ 1 నుంచి 6వ వీధులు, రాజా గార్డెన్, రాజాకల్యాణి వీధి, కుప్పం రోడ్డు, న్యూ కాలని 1 నుంచి 3 వీధులు, కర్పగాంబాళ్ నగర్ 1 నుంచి 3 వీధులు, శ్రీనివాసపురం 1,2 వీధులు, నజీమ అవెన్యూ, ఈసీఆర్ మెయిన్ రోడ్డు, తిరువళ్లువర్ నగర్ 39 నుంచి 34వ క్రాస్ వీధులు, తిరువళ్లువర్ నగర్ 2 నుంచి 7 మెయిన్ రోడ్డు, కావేరి నగర్ 1 నుంచి 6 వీధులు, బేవాచ్ బైల్‌వార్డ్, వళ్లలార్ నగర్, కొట్టివాక్కం కుప్పం 1వ వీధి, హౌసింగ్ బోర్డు అపార్ట్‌మెంట్స్ తెండ్రల్ హెచ్ 43 నుంచి హెచ్ 50, ముల్లై హెచ్ 70 నుంచి హెచ్ 78 ఫ్లాట్స్.

వృద్ధురాలి హత్య కేసులో కోర్టు తీర్పు

● భార్యకు 31 ఏళ్లు, భర్తకు ఏడేళ్లు జైలుశిక్ష

పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నగలు, నగదు కోసం వృద్ధురాలిని సజీవదహనం చేసిన కేసులో భార్యకు 31 ఏళ్లు, భర్తకు ఏడేళ్లు జైలుశిక్ష విధిస్తూ కాంచీపురం జిల్లా కోర్టు తీర్పునిచ్చింది. కాంచీపురం జిల్లా సెంగాడు ప్రాంతంలో 2012లో సజీవ దహనమైన వృద్ధురాలి మృతదేహం ఉన్నట్లు గ్రామ నిర్వహణాధికారి కార్యాలయం నుంచి పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల విచారణలో.... ఆ వృద్ధురాలు తిరువళ్లూర్ జిల్లా ఈక్కాడు ప్రాంతానికి చెందిన రాజమ్మాళ్ (69) అని తెలిసింది. ఈ కేసు విచారించిన ప్రత్యేక బృందం రాజమ్మాళ్ పక్కింట్లో ఉంటున్న భాస్కర్ (45), అతని భార్య సరిత (41) కలిసి వృద్ధురాలిని హతమార్చి 5 సవర్ల నగలు దోచుకున్నారని, మృతదేహాన్ని సెంగాడు ప్రాంతానికి తీసుకొచ్చి దహనం చేసి పారిపోయినట్లు తెలిసింది. ఈ కేసులో భాస్కర్, సరితలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు చెంగల్పట్టు జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో విచారణ సాగుతుండగా, వృద్ధురాలు హత్యకేసులో సరితకు 31 ఏళ్ల జైలుశిక్ష, రూ.3 వేలు జరిమానా, భాస్కర్‌కు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి పీవీ సెమ్మల్ తీర్పు వెలువరించారు.

తల్లి మందలించడంతో అన్నదమ్ముల ఆత్మహత్య

పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ఇంటికొచ్చిన కుమారులను తల్లి మందలించడంతో ఇద్దరూ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాంచీపురం జిల్లాలో చోటుచేసుకుంది. కమ్మవారపాళయం గ్రామానికి చెందిన జయలక్ష్మి, పెద్ద కుమారుడు విఘ్నేష్ (28), చిన్న కుమారుడు గణేష్ (24) శ్రీపెరుంబుదూర్ ప్రాంతంలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. అదే కర్మాగారంలో పనిచేస్తున్న యువతిని గణేష్ ప్రేమిస్తుండడంతో తల్లి ఖండిస్తూ వచ్చింది. ఈ క్రమంలో, బుధవారం రాత్రి విఘ్నేష్, గణేష్ మద్యం సేవించి ఇంటికి రావడంతో తల్లి ఇద్దర్నీ మందలించింది. తల్లి మందలింపుతో మనస్తాపం చెందిన ఇద్దరూ, ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దిగ్భ్రాంతి చెందిన జయలక్ష్మి, చుట్టుపక్కల వారి సాయంతో పోరూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స ఫలించక గురువారం ఉదయం గణేష్, రాత్రి విఘ్నేష్ మృతిచెందారు. ఈ ఘటనపై మనవాళనగర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరి మృతి

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా వయ్యపంట్టి సమీపంలో శుక్రవారం ఉదయం రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. కరూరు జిల్లా కడవూరు సమీపం వాయ్‌వార్ మంగళం ప్రాంతానికి చెందిన మురుగేశన్ (62) ఓ సంస్థలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఆయన స్నేహితుడు ముత్తు (67) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇద్దరూ కలిసి తేక్కమలైలో జరిగిన ఓ విందు కార్యక్రమంలో పాల్గొని తర్వాత బైకులో స్వస్థలానికి బయలుదేరారు. తిరుచ్చి - దిండుగల్ హైవేలో వెళ్తుండగా తేక్కమలై కోవిల్‌పట్టి రహదారిలో ఎదురుగా వచ్చిన మరో బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో మురుగేశన్ తీవ్రంగా గాయపడి ఆ స్థలంలోనే మృతి చెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన ముత్తును, ప్రమాదానికి కారణమైన బైకు నడిపిన వడివేల్ (39)ను చికిత్స నిమిత్తం మణప్పారై ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముత్తు ఆరోగ్యపరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం తిరుచ్చి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక ముత్తు ప్రాణాలు కోల్పోయాడు. వయ్యంపట్టి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



మృతి చెందిన ముత్తు, మురుగేశన్ (ఫైల్‌ఫొటో)

విద్యార్థికి కృత్రిమ కాళ్లు

వేలూరు, ఆగస్టు 1: రోడ్డు ప్రమాదంలో కాళ్లు పోగొట్టుకున్న విద్యార్థిని శక్తి అమ్మ కృత్రిమ కాళ్లు అందజేశారు. చెన్నైకి చెందిన ప్లస్ టూ విద్యార్థి ధనుష్, కొద్దిరోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న తిరుమలైకోడి నారాయణి పీఠాధిపతి శక్తి అమ్మ, ధనుష్‌కు రూ.10 లక్షల విలువైన కృత్రిమ కాళ్లు అందజేశారు. పీఠం ప్రాంగణంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నారాయణి పీఠం మేనేజర్ సంపత్, స్వర్ణాలయం డైరెక్టర్ సురేష్‌బాబు, నారాయణి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజి, విద్యార్థి తల్లిదండ్రులు ఉన్నారు.



కృత్రిమ కాళ్లు అందజేస్తున్న శక్తి అమ్మ

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 574 గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఖాళీ ఉన్న పాఠ్యాంశాల్లో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే, సంబంధిత పాఠ్యాంశాల్లో నెట్, సెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత లేదా యూజీసీ నిబంధనల ప్రకారం పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండాలి. అభ్యర్థులకు ఈ ఏడాది జూలై 1వ తేదీకి 57 ఏళ్లుండాలి. తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టనున్న ఈ పోస్టులకు వేతనంగా నెలకు రూ.25,000 అందించనున్నారు. కళాశాల విద్య డైరెక్టరేట్ నిర్వహించే ఇంటర్వ్యూ, పీజీలో పొందిన మార్కుల ఆధారంగా పోస్టులు భర్తీచేయనున్నారు. దరఖాస్తు రుసుముగా ఎస్సీ ఎస్టీలు రూ.100, ఇతర విభాగాలు రూ.200 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అర్హులైన వారు www.tngasa.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 4వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలని కళాశాల విద్య డైరెక్టరేట్ తెలిపింది.

విజయదశమి రైళ్లకు రిజర్వేషన్ ప్రారంభం

పెరంబూర్,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి):దేశప్రజలు అక్టోబరు 1,2 తేదీల్లో ఆయుధపూజ, విజయదశమి పండుగలు జరుపుకోనున్నారు.ఈ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రజల సౌకార్యర్థం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ముందుస్తు రిజర్వేషన్ శనివారం నుంచి ప్రారంభమైంది. ప్రజల సౌకర్యార్థం ప్రయాణానికి 60 రోజులు ముందుగా రైలు టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. ఆ ప్రకారం, సెప్టెంబరు 30వ తేది ప్రయాణానికి శనివారం (ఆగస్టు 1వ తేది) రిజర్వేషన్ ప్రారంభమైంది. అక్టోబరు 1వ తేది ప్రయాణానికి ఆదివారం, అక్టోబరు 2వ తేది ప్రయాణానికి సోమవారం, అక్టోబరు 3వ తేది ప్రయాణానికి మంగళవారం, అక్టోబరు 4వ తేది ప్రయాణానికి బుధవారం, అక్టోబరు 5వ తేది ప్రయాణానికి గురువారం, అక్టోబరు 6వ తేది ప్రయాణానికి శుక్రవారం ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు. ఉదయం 8 గంటల నుంచి అన్నిరకాల రిజర్వేషన్ ప్రారంభం కానుందని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

మెట్రోలో ఒకే నెలలో కోటి మంది ప్రయాణం

పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైళ్లలో గత నెలలో మాత్రమే కోటి మంది ప్రయాణించారు. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... జూలై 1 నుంచి 31వ తేది వరకు మెట్రో రైళ్లలో 1,03,78,835 మంది ప్రయాణించారని, జూన్‌తో పోల్చితే ఈ సంఖ్య 11,58,910 మంది అధికమని తెలిపింది. జూలై 4వ తేది అధికంగా 3,74,948 మంది ప్రయాణించారని తెలిపింది. ఎన్‌సీఎంసీ సింగార చెన్నై కార్డు ద్వారా 51,56,786 మంది, సీఎంఆర్‌ఎల్ ట్రావెల్ కార్డు ద్వారా 6,55,991, సింగల్ జర్నీ పేపర్ క్యూఆర్, టోకెన్ ద్వారా 20,78,2789 మంది, ఆన్‌లైన్ క్యూఆర్ టిక్కెట్ల ద్వారా 3,07,083, వాట్సాప్ (+91-8300086000) ద్వారా 6,12,717, పేటీఎం ద్వారా 4,18,788, ఓఎన్‌డీసీ ద్వారా 6,59,561, ఫోన్ పే ద్వారా 3,33,902, సీఎంఆర్‌ఎల్ మొబైల్ యాప్ ద్వారా 1,55,729 మంది టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రయాణించారని సీఎంఆర్‌ఎల్ తెలిపింది.

అమ్మవారి విగ్రహం తొలగింపు

వేలూరు, ఆగస్టు 1: గుడియాత్తం ఎన్ఎస్‌కే నగర్‌లో ఎన్నో ఏళ్లుగా మారియమ్మన్ ఆలయం నిర్మించుకుని ఆ ప్రాంత ప్రజలు పూజలు నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం కోర్టు ఉత్తర్వులతో, కౌండిన్య నదిని ఆక్రమించి నిర్మించిన 1,500 ఇళ్లు, మారియమ్మన్ ఆలయాన్ని పీడబ్ల్యూడీ అధికారులు తొలగించారు. ఈ క్రమంలో, కొందరు ఆలయం తొలగించిన ప్రాంతంలో మారియమ్మన్ విగ్రహం ఉంచి పూజలు నిర్వహించారు. సమాచారం అందుకున్న గుడియాత్తం ఆర్డీఓ, తహసీల్దార్ సిబ్బందితో అక్కడకు చేరుకుని విగ్రహాన్ని తొలగించారు. అనుమతి లేకుండా విగ్రహం ఏర్పాటుచేసి పూజలు చేస్తున్నారంటూ ఆరుగురు మహిళలు సహా 16 మందిపై గుడియాత్తం పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

నివేద కుంచె నుంచి జాలువారిన చిత్రాలు



తేయాకు పొడితో రూపొందిన చిత్రాలు





నివేద

కాదేదీ కళకు అనర్హం

- తేయాకు పొడితో కళాఖండాలు
- 'టీ ఆర్ట్స్'లో అద్భుతాలను ఆవిష్కరిస్తున్న నివేద





ఏదైనా సాధించాలనే తపన, కొత్తదనం కోరుకునే యువత ఆలోచనలు ఎప్పుడూ విభిన్నంగానే ఉంటాయి. టీ పొడి ఉపయోగించి అద్భుత చిత్రాలు రూపొందించి అందరి ప్రశంసలు అందుకుంటున్న కళాకారిణి నివేద. బాల్యం నుంచే చిత్రలేఖనంపై ఆసక్తి పెరిగింది. ప్రారంభంలో పెన్సిల్ పోర్ట్రెయిట్‌లు, సూక్ష్మ చిత్రాలు, డూడుల్స్, డిజిటల్ కళాకృతులను రూపొందించేది. అందరిలా కాకుండా తాను ప్రత్యేక బాటలో పయనించాలనుకుంది. పెయింటింగ్స్‌లో కొత్త పద్ధతిని అవలంభించాలని తేయాకు పొడితో రసాయనాలకు తావులేకుండా అద్భుత కళాఖండాలను సృష్టించసాగింది. 'ఈ టీ ఆర్ట్ (తేయాకు కళ) ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తేయాకు ప్రేమికులకు, తేయాకు రైతులకు అంకితమిచ్చే ప్రయత్నం' అంటూ నివేద తన కళాత్మక పయనం గురించిన తెలిపిన విశేషాలనే నేటి 'తరుణి'లో అందిస్తున్నాం....

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

మనిషి తనలో దాగిన భావాలను చిత్రాల ద్వారా అందరికీ అర్థమయ్యేవిధంగా సృష్టించగలడు. అదే సమయంలో మోడ్రన్ ఆర్ట్‌లోనూ ఎన్నో భావాలను లోకానికి చాటి చెప్పగలడు. ఈ చిత్రాలకు వివిధ రంగులను అద్దినప్పుడే అవి కనువిందు చేస్తాయి. రసాయనాలతో కూడిన పెయింట్లు అందుబాటులో లేని కాలంలో కాయగూరలతో సహజసిద్ధంగా తయారైన రంగులతో వర్ణచిత్రాలను ఆవిష్కరింపజేసేవారు. చిత్రాల ద్వారా ప్రతి కళాకారుడు తమ కళాకృతులు ఇతరులకన్నా భిన్నంగా, వైవిధ్యభరితంగా ఉండాలని కోరుకుంటారు. ఆ విధంగానే 19యేళ్ల నివేద టీ పొడితో చూడచక్కటి పెయింటింగ్స్‌ను రూపొందించి కళారంగంలో ఖ్యాతి గడిస్తోంది. ఈ కళాకృతులు కొత్తదనంతో ఉండటంతో ఈ తేయాకు పెయింటింగ్స్‌ను చాలా మంది ఇష్టపడుతున్నారు. 'టీ ఆర్ట్'తో తాను చిత్రాలు రూపొందించడమే కాకుండా ఆసక్తి ఉన్న వారికి శిక్షణ కూడా అందిస్తోంది.

స్వీయశిక్షణే...

"నా స్వస్థలం దిండివనం సమీపంలో ఉన్న సెంజి. అక్కడే పుట్టిపెరిగాను. ప్రస్తుతం చెన్నైలోని ఓ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాను. నాకు చిన్నప్పటి నుంచి పెయింటింగ్స్‌పై ఆసక్తి ఉండేది. ప్రారంభంలో పెన్సిల్ ఆర్ట్, సూక్ష్మ చిత్రాలు, డిజిటల్ కళాకృతులను రూపొందించేదాన్ని. వారానికి ఒక పెయింటింగ్ వేయకపోతే నిద్రపట్టేది కాదు. ఇంట్లోనే పెయింటింగ్‌పై పాఠాలు నేర్చుకున్నాను. స్కూల్లో ఎయింటింగ్ పోటీల్లో పాల్గొనేదాన్ని. అయితే ఆ సమయంలో పెయింటింగ్స్ కోసం నేను ఎలాంటి వ్యక్తిగత శిక్షణ తీసుకోలేక పోటీల్లో బహుమతులు గెలుచుకోలేకపోయాను. ఆ తర్వాత నేను 9వ తరగతి చదువుతున్నప్పుడు మాత్రమే పెయింటింగ్స్ పోటీల్లో సీరియస్‌గా పాల్గొనటం ప్రారంభించాను. ఇంట్లోనివారు నాకు పెయింటింగ్స్ పట్ల ఉన్న ఆసక్తిని గమనించి, మరింత ప్రోత్సహించారని నివేద వివరించింది.

తరుణి



కరోనా లాక్‌డౌన్‌లో...

కరోనా లాక్‌డౌన్ అందరినీ గృహనిర్బంధానికి గురిచేసింది. ఆ సమయంలో అందరిలా భయంతో గడపలేదు. ఆ సంక్షోభ కాలాన్ని పెయింటింగ్ ప్రాక్టీస్‌కు ఉపయోగించుకున్నాను. కొత్త రకాల పెయింటింగ్‌ల కోసం శిక్షణ తీసుకున్నాను. చాలా మంది పెయింటర్లు ఉన్నప్పటికీ వారిలో కొందరు మాత్రమే గుర్తింపబడతారు. నా పెయింటింగ్స్ కూడా పదికాలాలపాటు నిలబడాలని కోరుకున్నాను. దాని కోసం పెన్సిల్ పోర్ట్రెయిట్‌లు, వాల్ పెయింటింగ్‌లు, డిజిటల్ ఆర్ట్, మొఘల్ పెయింటింగ్, మెహందీ మొదలైనవి నేర్చుకున్నాను. చిత్రలేఖనం చేయడానికి ఇంకా ఏవైనా కొత్త మార్గాల గురించి ఆలోచించినప్పుడు నాకు టీ పెయింటింగ్ తారసపడింది. తేయాకు పొడితో బొమ్మలు వేయడంపై సమాచారం కోసం తీవ్రంగా ప్రయత్నించాను. ఎవరూ నాకు చెప్పలేదు. పెయింటింగ్‌లు చూడటానికి అందంగా ఉన్నప్పటికీ, వాటిని పెయింట్ చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. కారణం ఏమిటంటే టీ ఆర్ట్ చేసేందుకు చాలా సమయం పడుతుంది. మొదట తేయాకు పొడిని మరిగించి, రెండువారాల పాటు నిల్వ చేయాలి. అప్పుడే దానిని పెయింట్‌లా బొమ్మలు గీయడానికి ఉపయోగించగలం. తేయాకు పొడిని పెయింట్‌లా తయారు చేయడం అంత సులభమైన పని కాదు కాబట్టే చాలా మంది దీనిని ఉపయోగించరు. నేను టీ లవర్‌ని. పెయింటింగ్ లవర్‌ని కూడా. ఈ రెండింటినీ కలిపితే ఎలా ఉంటుందో తెలుసుకోవాలని అనిపించింది. వెంటనే బరిలోకి దిగాను. పెయింటింగ్ చేయడానికి కనీసం 5 గంటలు పడుతుంది. పెయింటింగ్‌లు గోధుమ రంగులో ఉంటాయి. పెయింట్ చేయడం కూడా కష్టం. ఇతర పెయింటింగ్‌లను అనేక రంగుల్లో పెయింట్ చేయవచ్చు. కానీ టీ ఆర్ట్‌లో తేయాకు రంగును మాత్రమే ఉపయోగిస్తాం. కాబట్టి ఈ పెయింటింగ్ కావాలనుకునేవారు ఓర్పు వహించాల్సి ఉంటుంది. ఈ తేయాకు పొడి పెయింట్‌తో రాజకీయ నేతలు, ప్రముఖులు, సినీ హీరోలను పెయింట్ చేస్తే చాలా అందంగా కనిపిస్తాయి. చాలా మంది వారి పెంపుడు జంతువులను కూడా పెయింట్ చేయమని అడుగుతారు. వారి కోరిక ప్రకారమే జంతువుల బొమ్మల్ని కూడా పెయింట్ చేశానని వివరించింది.



ఆగదు ఈ పయనం...

ఈ పెయింటింగ్‌లో శిక్షణ పొందటానికి నేను ఎవరి దగ్గరకు వెళ్ళలేదు. స్వయంగా నేర్చుకున్నాను. కాబట్టి నేను గతంలో వేసిన పెయింటింగ్స్‌ను తాజా వాటితో పోల్చి చూసుకుంటాను. పెయింటింగ్‌లో నైపుణ్యాన్ని మెరుగు పరచుకుంటున్నాను. నా పెయింటింగ్స్‌లో శ్రీకృష్ణుడి పెయింటింగ్ అంటే చాలా చాలా ఇష్టమని నివేదా తెలిపింది. పిన్న వయస్సులోనే తేయాకు పొడి పెయింట్‌తో అద్భుత కళాఖండాలు సృష్టించిన నివేదాను లలిత కళా అకాడమీ వంటి ఎన్నో ప్రముఖ సంస్థలు సత్కరించాయి. ఎన్నో పురస్కారాలను అందుకున్నా ఈ కళలో తానింకా నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని, ఆ దిశగానే తన కళాత్మక పయనం సాగుతూనే ఉంటుంది" అంటూ నవ్వుతూ తెలిపింది నివేద. ఆత్మవిశ్వాసంతో కూడిన నివేద మాటలు కళారంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంటుందనే నమ్మకం అందరికీ కలుగుతుంది. బెస్ట్ ఆఫ్ లక్!

సీయూబీ నికరలాభం రూ.306 కోట్లు

- సీయూబీ ఎండీ కామకోడి



చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సిటీ యూనియన్ బ్యాంక్ (సీయూబీ) నికరలాభం గత యేడాది కంటే ఈ యేడాది 16 శాతం మేర పెరిగి రూ.306 కోట్లకు చేరిందని ఆ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ కామకోడి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ 30తో ముగిసిన ఆ బ్యాంక్ తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ఆయన వెల్లడించారు. బ్యాంక్‌లో నికరవడ్డీ ఆదాయం రూ.625 కోట్లకు పెరిగిందని, వడ్డీయేతర ఆదాయం గత యేడాది తొలి త్రైమాసికం కంటే 27 శాతం పెరిగి రూ.244 కోట్లకు చేరిందన్నారు. బ్యాంకులో డిపాజిట్లు కూడా 20 శాతం పెరిగి, రూ.54,857 కోట్ల నుండి రూ.65,734 కోట్లకు చేరాయని వివరించారు. తొలి త్రైమాసికంలో గత యేడాది రూ.46,548 కోట్ల మేర రుణాలు మంజూరు చేయగా, ఈ యేడాది రూ.54,020 కోట్ల రుణాలు మంజూరు చేశామని కామకోడి తెలిపారు.

బిడ్డకు తల్లిపాలు ఎంతో ముఖ్యం

- గాయని నిత్యశ్రీ మహాదేవన్

నిత్యశ్రీని సత్కరిస్తున్న నిర్వాహకులు



చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బిడ్డకు తల్లిపాలు ఎంతో ముఖ్యమని, ఈ విషయంలో వివిధ కారణాలు, ఒత్తిళ్ల వల్ల కొంతమంది మహిళలు తమ బిడ్డకు పాలివ్వలేకపోతున్నారని ప్రముఖ కర్ణాటక సంగీత కళాకారిణి నిత్యశ్రీ మహాదేవన్ పేర్కొన్నారు. శుక్రవారం శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె బిడ్డకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. తమిళనాడు ప్రభుత్వ జాతీయ ఆరోగ్య మిషన్ నిపుణుల సలహాదారు డాక్టర్ ఎస్.శ్రీనివాసన్ 'తల్లి పాలివ్వడానికి ప్రాధాన్యతివ్వండి: స్థిరమైన మద్దతు వ్యవస్థలను సృష్టించండి' అనే అంశంపై కీలకోపన్యాసం చేస్తూ.. దేశంలో ప్రస్తుతం 42 శాతం మంది మాత్రమే తమ పిల్లలకు తల్లిపాలిస్తున్నారని వెల్లడించారు. ఈ క్షీణతకు గల కారణాలను మనం అన్వేషించి, పరిష్కరించాల్సిన అవసరముందని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఉమా శేఖర్, డీన్ డాక్టర్ కె.బాలాజీ సింగ్, డాక్టర్ లతా రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేపీడీలో ఘనంగా అన్నకూట మహోత్సవం



అన్నకూట ఉత్సవంలో పాల్గొన్న పాలకమండలి సభ్యులు

ప్యారీస్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆడిమాస శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక ప్యారీస్‌లో వున్న కన్యకాపరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో అన్నకూట మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు ఎస్‌కేపీ మహిళా కళాశాల ప్రాంగణంలో 102 పాలబిందెలతో విశేషపూజలు నిర్వహించి, ఆలయ అర్చకుల నేతృత్వంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన పూర్తి చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణం నుంచి పాలబిందెలతో మహిళలు, ఆలయ పాలకమండలి సభ్యులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి క్షీరాభిషేకం అనంతరం ఆలయ మహామండపం వద్ద 102 కిలోల అన్నాన్ని రాశిగా పోసి గుగ్గిళ్లు, అరిసెలు, వడలు, జాంగ్రీ, మైసూర్‌పాక్, ఆపిల్, ద్రాక్ష, జామ తదితర తినుబండారాలతో అలంకరించి అన్న ప్రసాదం తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారు. ఈ ఉత్సవంలో ఆలయ ధర్మకర్త కొల్లా వేంకట చంద్రశేఖర్‌తో పాటు పాలకమండలి సభ్యులు, ఎస్‌కేపీడీ, కేసీసీటీ, ఎస్‌కేపీసీ విద్యాసంస్థల విద్యార్థులు, టీచర్లు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంప్రదాయ వస్త్రధారణలో అలరించిన విద్యార్థినులు



ప్యారీస్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజా అన్నామలైపురంలో ఉన్న డా.ఎంజీఆర్ జానకి మహిళా కళాశాలలో ఈ నెల 3వ తేదీ జరుగనున్న ఆడిపెరుక్కు పర్వదినాన్ని ఆహ్వానిస్తూ శుక్రవారం కోలాహలంగా వేడుకలు జరుపుకున్నారు. సుమారు 4 వేల మందికి పైగా విద్యార్థినులు, అధ్యాపకులు సంప్రదాయ వస్త్రధారణతో నీటితొట్టిలో దీపాలు వదిలి ప్రార్థించారు. గరగాట్టం, నెమలాట్టం, కోలాటం, ఉట్టి కొట్టి, జానపద నృత్యాలతో తమిళ సంస్కృతికి అద్దం పట్టారు. ఈ మాసంలో నదీ పరివాహక ప్రాంతాల్లో ఆడి మాసం తమిళ నెల 18వ రోజు ఆడి పెరుక్కును ఆహ్వానిస్తూ డాక్టర్ ఎంజీఆర్ జానకీ మహిళా కళాశాలలో ప్రాంగణం విద్యార్థినుల ఆటపాటలు, జానపద నృత్యాలతో కళకళలాడింది.



నేత్రవైద్య శిబిరానికి విశేష స్పందన

ప్యారీస్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ)ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన మెగా నేత్రవైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కళాశాల ఆడిటోరియంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు సాగిన ఈ శిబిరంలో ఎస్‌కేపీసీ, ఎస్‌కేపీడీ విద్యాసంస్థల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజలు సుమారు 600 మందికి పైగా రాజన్ ఐకేర్ ఆస్పత్రి సిబ్బంది నేత్రపరీక్షలు నిర్వహించారు. ఇందులో దృష్టిలోపం ఉన్న వారికి ఉచితంగా కళ్ళజోళ్లను పంపిణీ చేశారు. ఐక్యూఏసీ, వైఆర్‌సీ, వైఐ, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దక్షిణ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్‌గా అరుళ్ జ్యోతి



పెరంబూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్‌గా కె.అరుళ్ జ్యోతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1995 ఇండియన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సర్వీస్ (ఐఆర్‌పీఎఫ్ఎస్) బ్యాచ్ అధికారి అయిన అరుల్ జ్యోతి, నార్త్ ఫ్రాంటియర్ రైల్వే, చెన్నై ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, తూర్పు, మధ్య రైల్వే, ఇతర జోన్లలో వివిధ హోదాల్లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో సేవలందించారు. ముఖ్యంగా, 2019-2020 కొవిడ్-19 సమయంలో దక్షిణ రైల్వే డీఐజీగా పనిచేసిన అరుళ్ జ్యోతి, నేరాలు నియంత్రించడం, 503 శ్రామిక ప్రత్యేక రైళ్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు వలస కార్మికులను సురక్షితంగా తరలించిన ఆర్పీఎఫ్ బృందాలకు నేతృత్వం వహించారు. గతంలో ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్‌గా ఉన్న జీఎం ఈశ్వరరావు గత నెల 31న పదవీవిరమణ పొందడంతో, ఆయన స్థానంలో అరుళ్ జ్యోతి నియమితులయ్యారు.

రెనాల్ట్ నిస్సాన్ ఆధ్వర్యంలో మహిళలకు ఈ-ఆటోల పంపిణీ



చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ అండ్ బిజినెస్ సెంటర్ ఇండియా ఆధ్వర్యంలో 'ప్రాజెక్ట్ మలర్' పథకం కింద 20 మంది మహిళలకు ఈ-ఆటోలను పంపిణీ చేశారు. ఆ సంస్థ నిర్వహించిన అన్ని రకాల పరీక్షలలో ఉత్తీర్ణులైన మహిళలు డ్రైవింగ్ లైసెన్స్ పొందిన మీదట వారికి ఈ-ఆటోలను అందజేసినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దిబాశిష్ నియోగి తెలిపారు. చెంగల్పట్టులో జరిగిన ఈ కార్యక్రమంలో చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ డి.స్నేహ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఈ-ఆటో తాళాలను అందజేస్తున్న రెనాల్ట్ నిస్సాన్ నిర్వాహకులు

చిత్రజ్యోతి

'డి-54' చిత్రీకరణ షురూ



ధనుష్

స్టార్ హీరో ధనుష్ 54వ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. వేల్స్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానరుపై డాక్టర్ ఐసరి కె.గణేష్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 'పోర్ తొళిల్' ఫేం విఘ్నేష్ రాజా దర్శకుడు. ఇందులో ధనుష్ సరసన పూజా హెగ్డే కథానాయిక. ఈ సినిమా షూటింగ్‌లో ధనుష్ నటిస్తున్న దృశ్యాన్ని నిర్మాణ సంస్థ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసింది. ఒక పాత పీసీఓ బూత్ నుంచి ధనుష్ ఫోన్ చేస్తున్నట్టుగా ఈ స్టిల్ ఉంది. ధనుష్‌కు అనేక హిట్ మ్యూజికల్ ఆల్బమ్స్ ఇచ్చిన ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీత స్వరాలు సమకూర్చుతున్నారు. ఇదిలావుంటే, ఈ చిత్ర వివరాలను నిర్మాత గణేష్ వివరిస్తూ 'ధనుష్, విఘ్నేష్ రాజా, జీవీ ప్రకాష్ కుమార్ వంటి అసాధారణ ప్రతిభ కలిగిన వారితో కలిసి పనిచేయడం ఎప్పుడూ ఆనందంగా ఉంటుంది. మా బ్యానరుపై నిర్మించే చిత్రాలు ప్రేక్షకులకు అర్థవంతమైన, వినోదాత్మకంగా అందించేందుకు ప్రయత్నిస్తాం. నిజంగానే ఈ సినిమా ఎంతో ప్రత్యేకమైనది. త్వరలోనే అభిమానులతో మరిన్ని విషయాలు పంచుకుంటాం' అని పేర్కొన్నారు.

'లవ్ ఫెయిల్యూర్ మచ్చా...' అంటున్న ఎస్కే



'మదరాసి'లో శివకార్తికేయన్

హీరో శివకార్తికేయన్ (ఎస్కే) - డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'మదరాసి' చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ గురువారం విడుదల చేశారు. ఇది ఎస్కే నటించే 23వ చిత్రం. ఈ చిత్రం నుంచి తాజాగా రిలీజ్ చేసిన ఫస్ట్ సింగిల్ ప్రేమ విఫలమైన భగ్న ప్రేమికుడు పాడుతున్న పాటగా సాగుతుంది. ఎస్కే సరసన రుక్మిణి వసంత్ కథానాయిక. ఇతర ప్రాతల్లో విక్రాంత్, విద్యుత్ జమాల్, బిజూ మేనన్, డాన్సింగ్ రోజ్ సబీర్ తదిరులు నటిస్తున్నారు. సెప్టెంబరు 5వ తేదీన విడుదలకానున్న ఈ చిత్రం నుంచి 'సలంబలా..' అంటూ సాగే తొలి సింగిల్‌ను గురువారం సాయంత్రం విడుదల చేశారు. ఫన్ లవ్ ఫెయిల్యూర్, హై యాక్షన్ ఓరియంటెడ్ మూవీగా రూపొందిస్తున్నారు. ఎస్కే నటించిన 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ సినిమా విడుదలవుతుండడంతో కోలీవుడ్ ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొనివున్నాయి.

తెలుగు మూవీ 'కోర్ట్' రీమేక్‌పై ప్రశాంత్ దృష్టి



ప్రియదర్శి, ప్రశాంత్

తెలుగులో నేచురల్ స్టార్ నాని నిర్మాతగా రూపొందించిన 'కోర్ట్ - స్టేట్ వర్సెస్ ఏ నోబడీ' అనే హిట్ మూవీని కోలీవుడ్ నటుడు ప్రశాంత్ తమిళంలోకి రీమేక్ చేసే అంశంపై దృష్టిసారించారు. మార్చి 14న విడుదలైన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ఈ మూవీ తమిళ రీమేక్ హక్కులను ప్రశాంత్ తండ్రి, నిర్మాత, నటుడు త్యాగరాజన్ సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్టు సమాచారం. తమిళ 'కోర్ట్' మూవీలో ప్రముఖ నిర్మాత ఫైవ్‌స్టార్ కదిరేశన్ కుమారుడు కృతిక్, నటి దేవయాని కుమార్తె ఇనియా ప్రేమికులుగా నటించనున్నారు. అలాగే, తెలుగు సినిమాలోని ప్రియదర్శి పాత్రను తమిళంలో ప్రశాంత్, సాయికుమార్ పాత్రను త్యాగరాజన్ పోషించనున్నారు. త్యాగరాజన్, కదిరేశన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. పూర్తి వివరాలపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది.

డాక్టర్ కావాలని యాక్టర్ అయ్యాను

- మమిత బైజు



డాక్టర్ కావాలని యాక్టర్ అయ్యానని కోలీవుడ్‌లో వరుస అవకాశాలు చేజిక్కించుకుంటున్న మలయాళ హీరోయిన్ మమిత బైజు చెప్పుకొచ్చారు. అగ్రహీరో విజయ్‌తో 'జననాయగన్', ప్రదీప్ రంగనాథన్‌తో 'డ్యూడ్', విష్ణు విశాల్‌తో 'ఇరండు వానమ్', సూర్యతో ఒక చిత్రంలో నటిస్తూ ఎంతో బిజీగా ఉన్నారు. తాజాగా ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'నేను డాక్టర్ కావాలని భావించాను. కానీ, చిత్రపరిశ్రమలోకి అనుకోకుండా అడుగుపెట్టాను. అప్పటికీ డాక్టర్ కావాలన్న ఆశ ఉండేది. కానీ, ఆ సమయంలో ఏడు చిత్రాల్లో నటించేందుకు సంతకం చేశాను. దీంతో నా ఆశ వదులుకున్నాను. అయితే, నాన్న మాత్రం ఎంతో బాధపడ్డారు. డాక్టర్‌ను చేయాలని ఎంతగానో ఆశపడి సపోర్టు చేశారు. చివరకు నటిగా స్థిరపడేందుకు సమ్మతించారు' అని పేర్కొన్నారు.

కోలుకుంటున్న నటి రాధిక



అడయార్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా డెంగీతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సినీ నటి రాధిక ఆరోగ్యం క్రమంగా కుదుటపడుతోందని ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. ఆమెను ఈ నెల 5వ తేదీ వరకు పర్యవేక్షణలో ఉంచి, ఆ తరువాత డిశ్చార్జ్ చేస్తామని వారు వెల్లడించారు. కాగా, జ్వరంతో బాధపడుతూ గత నెల 28వ తేదీ ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్న రాధిక డెంగీ జ్వరంతో బాధపడుతున్నట్టు వైద్యులు నిర్ధారించారు. అప్పటి నుంచి ఆమె ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు.



మెటర్నిటీ కిట్లను అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

మెటర్నిటీ కిట్ల పంపిణీ

అడయార్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తల్లిపాల (బ్రెస్ట్ ఫీడింగ్) వారోత్సవాలను పురస్కరించుకుని రోటరీ క్లబ్ రూ.10 లక్షల విలువైన మెటర్నిటీ కిట్లను పంపిణీ చేయనుంది. ఇందులో భాగంగా మొదట రాయపురంలోని ఆర్ఎస్ఆర్ఎం ప్రభుత్వ ఆస్పత్రి లో పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా చెన్నై నగరంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వీటిని మహిళలకు అందజేయనున్నారు. 40 రోటరీ క్లబ్బులు, చెన్నై డిస్ట్రిక్ 3234 ఫస్ట్ లేడీస్, రోటరీ యాక్షన్ ఫర్ ఉమెన్ 2 ఈ సామాజిక సేవా కార్యక్రమంలో పాలుపంచుకోనున్నాయి. ఈ పంపిణీ కార్యక్రమాన్ని రొటేరియన్ డాక్టర్ సుసన్ వర్గీసీ, రొటేరియన్ సూర్యనారాయణ రావు పర్యవేక్షిస్తున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.66 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,149

తలనీలాలు సమర్పించినవారు: 24,429



కథనం, ఇంటర్వ్యూ : తిరుపతి, ఆంధ్రజ్యోతి

చిత్తూరు, తిరుపతి.. రెండు జిల్లాల్లో భాగంగా ఉన్న నియోజకవర్గం నగరి. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న ఈ నియోజకవర్గంలో రచ్చలు రావిళ్లతోనూ రాజకీయాలు నడుస్తాయి. పార్టీ ఏదైనా ఇక్కడ గ్రూపులు సహజం. ఏకతాటిపై నడక అసాధ్యం. ఇటువంటి చోట టీడీపీ ఎమ్మెల్యేగా 2024లో తొలి విజయం అందుకున్నారు గాలి భాను ప్రకాష్. తండ్రి దివంగత గాలి ముద్దుకృష్ణమనాయుడు తరహాలోనే నిరంతరం జనంలో ఉంటారు. జనం చెప్పింది వింటారు. చేయగలిగిందే చెబుతారు. చెప్పింది వెంటనే చేస్తారు. నగరి నియోజకవర్గంలో అభివృద్ధి ముద్రతో మరింత ఎదగాలని ఆశపడుతున్న గాలి భానుప్రకాష్‌తో తొలి ఏడాది పాలనపై ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ...



నేడు

నగరి మండలం గుండ్రాజుకుప్పం పంచాయతీ మారుతీనగర్‌లో రూ.8.40 లక్షలతో కొత్తగా నిర్మించిన సిమెంటు రోడ్డు



నాడు

అదే చోట రోడ్డు వేయకముందు పరిస్థితి

రూ.123 కోట్లతో అభివృద్ధి చేశా!

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



ప్రోగ్రెస్ రిపోర్ట్

వడమాలపేటలో ఫైవ్‌స్టార్ లగ్జరీ రిసార్టులు

నగరి నియోజకవర్గాన్ని పర్యాటక పరంగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించా. ఆతిథ్య రంగంలోనూ పెట్టుబడులు రప్పించడానికి ప్రయత్నిస్తున్నా. దానివల్ల స్థానిక యువతకు ఉపాధి దొరుకుతుంది. వ్యక్తిగత చొరవతో ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ రిసార్టులు, హోటళ్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నా. మొదటి ప్రయత్నంగా వడమాలపేట మండలం ఎస్వీపురం వద్ద పర్యాటక శాఖకు 12 ఎకరాల భూమిని ఇటీవలే ప్రభుత్వం కేటాయించేలా చూశా. ఆ భూమిని పర్యాటక శాఖ అట్మోస్ఫియర్ కోర్ అనే సంస్థకు ఫైవ్ స్టార్ లగ్జరీ రిసార్టుల కోసం కేటాయించనుంది.



తిరుమలకుప్పంలో నిర్మాణంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్

గాలి భానుప్రకాష్

పుట్టిన తేదీ: జూన్ 20,

తల్లిదండ్రులు : గాలి సరస్వతమ్మ, గాలి ముద్దుకృష్ణమనాయుడు

చదువు: అమెరికాలో మాస్టర్స్,

కుటుంబం: భార్య గాలి శిరీష, కుమారులు గాలి కృష్ణ, గాలి రామ్‌నాయుడు

● నగరి మండలం గుండ్రాజు కుప్పం, పుత్తూరు మండలం తిరుమలకుప్పంలో విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేయించా. తిరుమలకుప్పంలో నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. గుండ్రాజుకుప్పంలో పనులు త్వరలో ప్రారంభమవుతాయి.

గ్రావెల్.. లా అండ్ ఆర్డర్.. అండర్ కంట్రోల్

గతంలో నగరి నియోజకవర్గం గ్రావెల్ అక్రమ రవాణాకు పేరుమోసింది. అలాగే శాంతి భద్రతలు కూడా సక్రమంగా వుండేవి కావు. ఈ రెండింటి పట్ల కఠిన వైఖరి తీసుకున్నాం. ఇపుడు నియోజకవర్గం మొత్తం మీద ఎక్కడా గ్రావెల్ అక్రమ రవాణా అన్న మాటే వినిపించడంలేదు.

1 ఏడాదిలో ఏం చేశారు?

పల్లెలకు బస్సులు



పుత్తూరు డిపో పరిధిలో ఈ ఏడాది కాలంలోనే ఎనిమిది కొత్త బస్సు సర్వీసులు ప్రారంభించాం. అగరంపేట నుంచి 9వ మైలు, కండ్రిగల మీదుగా నగరికి, వెంగళత్తూరు నుంచి నింద్ర మీదుగా పిచ్చాటూరుకు, పరమాల నుంచి కుప్పం బాదూరు, బట్టి కండ్రిగల మీదుగా పుత్తూరుకు, ఎగువ పుత్తూరు నుంచి పాలమంగళం, సుబ్బానాయుడు కండ్రిగల మీదుగా పుత్తూరుకు, ఎలకటూరు నుంచి కావనూరు, కీలంబాకం, ఆరూరు మీదుగా నగరికి, పుత్తూరు నుంచి నారాయణవనం, గోవిందప్ప నాయుడు కండ్రిగ మీదుగా కైలాసకోనకు... ఇలా ఆరు మార్గాల్లో ప్రారంభించాం.





నింద్ర మండలం కైపాకం పంచాయతీలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

వచ్చే నెల నుంచీ మరమగ్గాలకు ఉచిత కరెంటు



నగరి, పుత్తూరు, నారాయణవనం మండలాల్లో 5500 మంది మరమగ్గాల కార్మికులున్నారు. మరమగ్గాలకు 500 యూనిట్ల వరకూ ఉచిత కరెంటు ఇవ్వాలని ఎన్నికలకు ముందే సీఎం చంద్రబాబును కోరా. ఆయన ఆమోదించారు. ఆగస్టు విద్యుత్ బిల్లు సెప్టెంబరులో వస్తుంది. ఆ బిల్లు నుంచీ ఉచిత విద్యుత్ అమల్లోకి రానుంది. నగరిలో 5500 మందికి లబ్ధి కలగనుంది.

ఇవి చేశాం

- రూ. 23.41 కోట్లతో 45 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం మొదలు. 32 కిలోమీటర్లు పూర్తి.
- రూ. 13 కోట్లతో గోకులం షెడ్లు పూర్తి అయ్యాయి.
- తుడా నుంచి రూ. 34.18 కోట్లతో తారు రోడ్లు, సీసీ రోడ్లు, తాగునీటి పథకాలు మంజూరు చేయించాం. రూ. 32 కోట్లతో తాగునీటి పథకాల పనులన్నీ పూర్తయ్యాయి.
- నియోజకవర్గంలో జడ్పీ, ఆర్ అండ్ బీ శాఖల నుంచీ రూ. 12.56 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, తారు రోడ్ల మరమ్మతులు, తాగునీటి పథకాల పనులు మంజూరయ్యాయి. రూ. 1.61 కోట్లతో తాగునీటి పనులు పూర్తయ్యాయి. మరో రూ. 4.80 కోట్లతో 90 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ఆర్ అండ్ బీ ద్వారా రూ. 6.15 కోట్లతో 190 కిలోమీటర్ల మేర రోడ్లకు ప్యాచ్ వర్కులు చేపట్టాం.



రూ.68 లక్షలతో బాగుపడిన విజయపురం మండలంలోని నెట్టేరి- కనకమ్మసత్రం రోడ్డు

చంద్రబాబును కోరుతున్నది ఇదే!

ఇవి చేయాలి

- రూ. 1.20 కోట్లతో 2.45 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి వుంది. ఇంకో రూ. 8.67 కోట్లతో 12.16 కిలోమీటర్ల మేరకు పనులు ప్రతిపాదించడం జరిగింది. రూ. 40.54 కోట్లతో 37.76 కిలోమీటర్ల మేరకు తారు రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి వుంది.
- రూ. 70 లక్షల తుడ నిధులతో 1.17 కిలోమీటర్ల తారు రోడ్డు చేపట్టాల్సి వుంది. అలాగే రూ. 1.48 కోట్లతో 2.44 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాల్సి వుంది.
- నియోజకవర్గంలో ఆరు విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి. ● ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలి. ఇందు కోసం విజయపురం మండలం కోసలనగరంలో 500 ఎకరాలు గుర్తించాం. ● నగరి వద్ద ఏకాంబరకుప్పం, అలాగే పుత్తూరులో ఆర్డీఎం గేటు, మరాఠీ గేటు తదితర మూడు రైల్వే లెవల్ క్రాసింగులున్న చోట్ల ఆర్వోబీల నిర్మాణం కోసం రైల్వే ఉన్నతాధికారులను కలసి ప్రతిపాదనలు అందజేశా. ● పుత్తూరు నుంచీ చెన్నై వరకూ ఇపుడున్న డబుల్ రోడ్డును సిక్స్ లేన్‌గా విస్తరించాలని ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలసి కోరాను.
- పుత్తూరు ప్రభుత్వాసుపత్రిని వంద పడకలకు స్థాయికి పెంపు
- గాలేరు-నగరి సుజల స్రవంతిని పూర్తి చేయాలి.
- వడమాలపేటలో ఈఎంసీ-3 ఏర్పాటు.
- నగరిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు. దానికోసం వీకేఆర్‌పురం వద్ద 150 ఎకరాలు గుర్తించాం.

తూత్తుకుడిలో అన్నదమ్ముల దారుణహత్య

● ముగ్గురి అరెస్టు

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి ధర్మల్‌నగర్ సమీపంలోని కోవిల్‌పిళ్లై నగర్‌కు చెందిన పాండ్యన్ (36) అరుళ్‌రాజ్ (30) అనే అన్నదమ్ములను హతమార్చి భూమిలో పాతిపెట్టిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. జూలై 28న ఇంటి నుండి బయటకు వెళ్ళిన పాండ్యన్, అరుళ్‌రాజ్ తిరిగి రాలేదు. అన్ని చోటా వెదికిన కుటుంబీకులు చివరకు ధర్మల్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. పండుకరై వాగు ఒడ్డున భూమిలో నుండి ఓ మనిషి చేయి బయటకు రావడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్ళి తవ్వించగా పాండ్యన్, అరుళ్‌రాజ్ మృతదేహాలు బయటపడ్డాయి. వెంటనే మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, తీవ్ర విచారణ జరిపి వారిద్దరిని మద్యం మత్తులో హతమార్చిన ముగ్గురిని అరెస్టు చేశారు.

అన్నా వర్సిటీ మాజీ వీసీ వేల్‌రాజ్ సస్పెన్షన్

అడయార్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగం కేసులో అన్నా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి వేల్‌రాజ్ సస్పెండ్‌కు గురయ్యారు. గిండీలోని అన్నా వర్సిటీలో 1992 నుంచి ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆయన.. 2004 నుంచి 2010 వరకు వర్సిటీ డిప్యూటీ డైరెక్టరుగా, 2010 నుంచి 2013 వరకు డైరెక్టరుగా, 2013 నుంచి ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎనర్జీ స్టడీస్ డైరెక్టరుగా వ్యవహరించారు. ఆ తర్వాత 2021లో అన్నా వర్సిటీ ఉపకులపతిగా నియమితులై 2024 వరకు కొనసాగారు. ఆయన వీసీగా ఉన్న సమయంలో వర్సిటీ పరిధిలో ప్రైవేటు కాలేజీలకు అనుమతులు మంజూరు చేయడంతో పాటు వర్సిటీ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయి. వీటిపై విచారణ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన రిటైర్మెంట్ వయసు జూలై 31వ తేదీ గురువారంతో ముగిసింది. అదే రోజున ఆయనను సస్పెండ్ చేయాలని యూనివర్సిటీ సిండికేట్ ఓ నిర్ణయం తీసుకుని సస్పెండ్ ఉత్తర్వులను ఆయనకు అందజేశారు. రిటైర్మెంట్ చివరి రోజున సస్పెండ్‌కు గురికావడంతో పదవీ విరమణ తర్వాత ఆయనకు రావాల్సిన అన్ని రకాల ఆర్థిక ఫలాలు, ఇతర సౌకర్యాలను నిలిపివేశారు.

హొగెనకల్‌లో తగ్గిన ఇన్‌ఫ్లో

● దోనెల సవారీకి అనుమతి

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హొగెనకల్ జలపాతంలో నీటిపరిమాణం తగ్గటంతో శుక్రవారం నుండి దోనెల సవారీకి అధికారులు అనుమతించారు. కొద్ది రోజుల క్రితం కర్ణాటకలో జలాశయాల నుంచి విడుదలైన జలాలు ఈ జలపాతంలో ప్రవేశించడంతో వరదలు సంభవించాయి. శుక్రవారం ఉదయం ఈ జలపాతంలోకి వచ్చే నీటి పరిమాణం తగ్గింది. ఈ నేపథ్యంలో ఐదు రోజులు విరామం తర్వాత ఆ జలపాతంలో పర్యాటకులను దోనెల సవారీకి అనుమతిస్తూ కలెక్టర్ ఆర్ సతీష్ ఉత్తర్వు జారీ చేశారు. దీనితో శుక్రవారం ఉదయం పర్యాటకులు జలపాతం వద్దకు చేరుకుని లైఫ్‌జాకెట్లు ధరించి దోనెలపై సవారీ చేశారు.



జలపాతంలో దోనెల సవారీ చేస్తున్న పర్యాటకులు

● పరువు హత్య వ్యవహారం..

కవిన్ మృతదేహం తల్లిదండ్రులకు అప్పగింత

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పాళయం కోట కేటీసీ నగర్‌లో పరువు హత్యకు గురైన ఐటీ ఉద్యోగి కవిన్ సెల్వగణేష్ (27) మృతదేహాన్ని శుక్రవారం మధ్యాహ్నం పోలీసులు కుటుంబీకులకు అప్పగించారు. పాళయంకోట ప్రాంతానికి చెందిన ఎస్ఐలుగా పనిచేస్తున్న శరవణన్, కృష్ణకుమారి దంపతుల కుమార్తె, కవిన్ చిన్నతనం నుంచి కలిసి చదువుకున్నారు. గత ఏడేళ్లుగా ఇరువురూ ప్రేమించుకున్నారు. వేర్వేరు కులాలకు చెందిన వీరి ప్రేమను యువతి తల్లిదండ్రులు నిరాకరించారు. ఆ నేపథ్యంలో ఆ యువతి తమ్ముడు సుర్జిత్ జూలై 27న కవిన్‌ను హతమార్చి పోలీసులకు లొంగిపోయాడు. ఈ పరువు హత్య రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది. కవిన్ కుటుంబీకులు, బంధువులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కవిన్ హత్యతో సంబంధం ఉన్న ఎస్ఐలుగా పనిచేస్తున్న యువతి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని, సీబీఐ విచారణ రపాలని డిమాండ్ చేస్తూ గత ఐదురోజులుగా ధర్నాలు, రాస్తారోకో నిర్వహించారు. తమ డిమాండ్లను ఆమోదించేంతవరకూ పోస్టుమార్టం పూర్తయిన కవిన్ మృతదేహాన్ని స్వీకరించబోమని అతడి తల్లిదండ్రులు పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పరువుహత్యపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించింది. ఎస్ఐ శరవణన్‌ను ఈ కేసులో మరో నిందితుడిగా చేర్చి పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం కవిన్ మృతదేహాన్ని అతడి తల్లిదండ్రులు స్వీకరించి సాయంత్రం అంత్యక్రియలు జరిపించారు. ఆ సందర్భంగా డీఎంకే ఎంపీ కనిమొళి, మంత్రి గీతా జీవన్, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ తదితర నేతలు కవిన్ తల్లిదండ్రులను పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు.



కవిన్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కనిమొళి, మంత్రి గీతాజీవన్

సీనియర్ కొరియోగ్రాఫర్ ఓమణ మృతి



ఓమణ (ఫైల్‌ఫొటో)

అడయార్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కోలీవుడ్‌కు చెందిన సీనియర్ కొరియోగ్రాఫర్ ఓమణ (74) మృతి చెందారు. వలసరవాక్కంలోని స్వగృహంలో వృద్ధాప్య సమస్యలతో పాటు అనారోగ్యంతో గురువారం ఆమె తుదిశ్వాస విడిచినట్టు కుమారుడు రాబర్ట్ మాస్టర్ వెల్లడించారు. అంత్యక్రియలు శుక్రవారం పూర్తి చేశారు. కాగా, ఓమణ భర్త ఆంటోనీ ఎంజీఆర్, శివాజీ గణేశన్, రజనీకాంత్, కమల్ హాసన్ వంటి అగ్రనటీనటుల చిత్రాలకు కొరియోగ్రఫీ చేశారు. ఆంటోనీ - ఓమణ దంపతుల కుమారుడే రాబర్ట్. ఇటీవల వచ్చిన 'మిసెస్ అండ్ మిస్టర్' చిత్రంలో నటి వనితతో కలిసి నటించారు. ఈ దంపతులకు రాబర్ట్‌తో పాటు శోభన, అల్ఫోన్సా అనే కుమార్తెలు, ప్రదీప్, మనోజ్ అనే కుమారులు కూడా ఉన్నారు. వీరంతా డ్యాన్స్ మాస్టర్లుగా చిత్రపరిశ్రమలో రాణిస్తున్నారు.

'కళ్లలగర్' హుండీ ఆదాయం రూ.53లక్షలు

ప్యారీస్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలోని కళ్లలగర్ ఆలయ హుండీ ఆదాయం రూ.53లక్షలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. భక్తులు స్వామివారి హుండీలో వేసిన నగదు, నగలు, విదేశీ కరెన్సీని గురువారం లెక్కించారు. ఇందులో రూ.53,54,409 నగదు, 32 గ్రాముల బంగారం, 200గ్రాముల వెండి, విదేశీ డాలర్లు ఉన్నాయి. ఆలయ సంయుక్త కమిషనర్ యజ్ఞనారాయణన్ సమక్షంలో హుండీలను తెరిచి అలగర్ తిరుకల్యాణ మండపంలో భారీ బందోబస్తు మధ్య జరిగిన లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెంగాళమ్మకు పుష్పయాగం



శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా సూళ్లూరుపేటలోని చెంగాళమ్మకు పుష్పయాగం నిర్వహించారు. ఆస్థాన మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి 20 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో పుష్పార్చన చేశారు. చామంతి, సంపంగి, రోజా, తామర, కనకాంబరం, మల్లె, గన్నేరు, నూరు వరహాలు, గన్నేరు, మొగలిరేకులు, మానసంపంగి పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరు, కదరిపచ్చ పత్రాలను వినియోగించారు. చెన్నైకి చెందిన నంబూరు మోహన్‌రావు, సులోచనమ్మ, నంబూరు మనోజ్‌సాయి, లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు ఆకుతోట రమేష్, ముంగర అమరావతి, భక్తులు పాల్గొన్నారు. - **సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి.**